# మనలో మాట

ఆంధ్రప్రదేశ్ పాలనా భాషగా ప్రజల భాష అయిన తెలుగును సచివాలయ స్థాయినుండి మండల స్థాయి వరకు తు.చ తప్పకుండ ప్రభుత్వ యంత్రాంగం అమలు చేసి తీరాలని 1966 నాటి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం ఆదేశించిన విషయం అందరికి తెలిసిందే. అయినా మనం గత 40 సంవత్సరాలుగా ఈ ఆదేశాన్ని పట్టించుకోకుండా అత్యధిక భాగం రాతకోతలన్నీ ఇంగ్లీషులోనే కొనసాగిస్తూ వచ్చాం. అందుకు కారణాలుగా కొన్నాళ్లు తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం రాదని, కావలసిన శిక్షణ యివ్వలేదని, టైప్ రైటర్లు లేవని, పాలనాయంత్రాంగం సాకులతో గడిపి తెలుగును పాలనా భాషగా అమలు జరపడానికి మొరాయిస్తూ వచ్చింది. పోనీ టైపు రైటర్లు వచ్చిన తరువాత అయినా పరిస్థితులలో మార్పు వస్తుందని ప్రజలు ఆశించారు. అయినా అనుకున్న స్థాయిలో ఫలితాలు రానందున ప్రజలకు నిరాశే మిగిలింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఉద్యమానికి నాయకత్వం వహించిన తెలుగు జాతికి "మాతృభాషలో బోధన" అన్న నినాదం మకుటంగా నిలిచింది. దీనిని పాలకులు, అధికార గణం విస్మరించడం వల్లనే నేడు దక్షిణ భారతంలోని 4 రాష్ట్రాలలో మాతృభాషలో పాలనను అత్యంత తక్కువ స్థాయిలో అమలు జరుపుకుంటున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఈ పరిస్థితి మెరుగుపడాలంటే వెంటనే పాలకులు, అధికారగణం తెలుగును పాలనా భాషగా అన్ని స్థాయిలలోనూ (కేంద్ర, ప్రభుత్వంతో/ రాష్ట్రేతర ప్రభుత్వాలతో/ అంతర్జాతీయ సంస్థలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు మినహా) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో సాగించే పాలనా వ్యవహారాలకు సంబంధించిన కార్యక్రమాలన్నీ ప్రజల భాష అయిన తెలుగులోనే కొనసాగించి తీరాలి.

కంప్యూటర్ యుగం వచ్చిన తరువాత లక్షలకొద్దీ ధనం వెచ్చించి తెచ్చుకున్న టైపురైటర్లను వాటి పూర్తి వినియోగానికి ముందే మూలకు నెట్టి వేశాము. కంప్యూటర్లు వచ్చిన తరువాత కూడ తెలుగు సాఫ్ట్ వేర్ లేదన్న సాకుతో తెలుగు వాడకాన్ని పక్కన పెట్టాం. తెలుగు సాఫ్ట్ వేర్లు వచ్చి (ఏ రకమైన సాఫ్ట్ వేర్ అయినా) ఆరు, ఏడు సంవత్సరాలు గడచి పోయాయి కాని పరిస్థితి లో మార్పులేదు. ఈ పరిస్థితిని శ్రద్ధగా గమనించిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పాలకులు, అధికారగణం పాలనా భాషగా తెలుగును సర్వత్రా అమలు పరచడానికి అడ్డంకిగా ఉన్నాయని ఇప్పటి వరకు చెబుతున్న సాకులకు ఆస్కారం లేకుండా చేయాలని నిర్ణయించి నిర్థిష్టమైన చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న తెలుగు సాఫ్ట్ వేర్ (ఐ లీప్) వల్ల పరిమితి ప్రయోజనాలు మాత్రమే ఉండటంవల్ల భాషాసంఘం, జాతీయ సూచనా విజ్ఞాన కేంద్రం" (నేషనల్ ఇన్ ఫర్మాటిక్స్ సెంటర్), డా.మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలు ఒక స్పష్టమైన అవగాహనకు వచ్చి, కేంద్ర సమాచార సాంకేతిక, సమాచార మంత్రిత్వశాఖ విడుదల చేసిన తెలుగు సాఫ్ట్ వేర్ ఉపకరణాలను ఉపయోగించి ఎటువంటి అడ్డంకులు లేని, స్వేచ్ఛగా వాడుకోదగిన తెలుగు సాఫ్ట్ వేర్ ను, ఎమ్.ఎస్.ఆఫీస్, ఓపెన్ ఆఫీస్ లలో అన్ని రకాల పాలనా సంబంధమైన కార్యకలాపాల నిర్వహణకు (రాత కోతలు, పట్టికలు, గ్రాఫులు, ప్రజంటేషన్లు వివిధ డిజైన్లలో గణాంకాలు వగైరా) ఏ విధంగా వాడుకో వచ్చునో తెలియజేసే శిక్షణ కార్యక్రమాలను రూపొందించింది.

ఈ సరికొత్త తెలుగు సాఫ్ట్ వేర్ ఉపకరణాల పైన సచివాలయంలో గల డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థకు చెందిన శిక్షణ కేంద్రంలో నవంబరు నెలాఖరు నుంచి వివిధ శాఖలకు చెందిన సిబ్బంది స్వల్ప వ్యవధిలోనే శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ చాల ఉపయోగకరంగా వుందని అందరినోటా వింటున్నాం. ఈ శిక్షణ కొనసాగుతూనే వుంటుంది. ఈ సాఫ్ట్ వేర్ ను సి.యం.సి, ఎన్.ఐ.సి సంస్థల సంపూర్ణ సహకారంతో సచివాలయంలోని అన్ని శాఖలలోని

కంప్యూటర్లలో పొందుపరిచాం. సంబంధిత శాఖల కార్యదర్శులందరికి, 23 జిల్లాల కలెక్టర్ కార్యాలయాలకు, మండల కేంద్రాలకు ఈ సాఫ్ట్ వేర్ సి.డి లను మరో రెండు నెలలోగా అందజేయడానికి భాషా సంఘం ఏర్పాట్లు చేస్తోందని తెలపడానికి సంతోషిస్తున్నాం. సంబంధిత కార్యదర్శులందరు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య తెలుగులో సమాచార వారధిని నిర్మించి పటిష్టం చేయడం కోసం ఉద్దేశించిన యీ ప్రయత్నానికి సంబంధిత శాఖల కార్యదర్శులందరు సహకరించాలని పదే పదే భాషా సంఘం విజ్ఞప్తి చేస్తోంది. పాలనలో ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య అవగాహనా రాహిత్యాన్ని తొలగించడానికి ప్రజల భాషలోనే అన్ని వ్యవహారాలు సాగించడానికి ఇంతకు మించిన మార్గం మరొకటిలేదని గ్రహించాలి. ఈ మొత్తం కార్యక్రమంలో భాషా సంఘానికి పూర్తి అండదండలు మొదటినుంచి అందిస్తున్న మాన్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి, ఆర్థిక శాఖా మాత్యులు శ్రీ కొణిజేటి రోశయ్య, డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ పూర్వ డైరెక్టర్ జనరల్ శ్రీ ఎమ్. నారాయణ రావు, అదనపు డైరెక్టర్ జనరల్ డా.పి. దయాచారి, ఎన్.ఐ.సి. ఉన్నతాధికారి శ్రీ బి.వి.శర్మ గార్లకు, సచివాలయంలోని న్యాయశాఖ ఉన్నతాధికారులకు మరియు ఈ పుస్తకాన్ని రూపొందించిన ఎన్.ఐ.సి.బృందానికి, తుదిమెరుగులు దిద్ది సమగ్రంగా తీర్చిదిద్ది సి.డి.ని కూడ తయారు చేసి యిచ్చిన శ్రీ రంభా భాస్కర్ గారికి నా ప్రత్యేక అభినందనలు తెలుపు తున్నాను. ఇక మీ క్రియాశీలమైన స్పందన కోసం ఎదురు చూస్తూ.

డా. ఎ.బి.కె.ప్రసాద్
అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం
సచివాలయం